


ఓటర్ల జాబితాలో తప్పులు ఉండరాదు

సీతంపేట, జనవరి 19: ఓటర్ల జాబితాలో ఒక్క తప్పు కూడా ఉండకూడదని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే సరిచేస్తామని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీతంపేట తహసీల్దార్ నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

భార్యలపై వాత్సల్యం!

- ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు
- కుటుంబీకులకు అవకాశాలు
- సంబంధిత ఉద్యోగులపై ఫిర్యాదులు
- ఇదీ మిషన్ వాత్సల్య పథకం తీరు





పార్వతీపురం, ఆంధ్రజ్యోతి

జిల్లాకు మంజూరైన 'మిషన్ వాత్సల్య' పథకం కొందరికి వరంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నడిచే ఈ పథకంలో ఉద్యోగ నియామకాలకు సంబంధించి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిల్డ్రన్ హోమ్ నిర్వహణ, అనాథ పిల్లల బాగు తదితర కార్యక్రమాల పర్యవేక్షణకు ఉద్యోగ నియామకాలు చేపట్టారు. మొత్తం 23 పోస్టులను భర్తీ చేశారు. ఇందులో కొన్ని ఉద్యోగ నియామకాలకు సంబంధించి అక్రమాలు జరిగాయని.. అనర్హులకు అవకాశం ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐసీడీఎస్‌కు అనుబంధంగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పోస్టుల కోసం ఆ విభాగంలోని కొంతమంది ఉద్యోగుల కుటుంబీకులు దరఖాస్తు చేసుకున్నారు. ఇక్కడి నుంచే అసలు కథ మొదలైంది. ఉద్యోగుల కుటుంబీకులను నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఉన్నతాధికారులకు కొంతమంది ఇప్పటికే ఫిర్యాదు చేశారు.

ఎంపిక కమిటీలో భర్త..

ఉద్యోగ నియామకాలకు సంబంధించిన కమిటీలో ఓ అధికారి ఉన్నారు. ఆయన సతీమణి సోషల్ వర్కర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆమె ఉద్యోగానికి ఎంపిక య్యారు. కమిటీలో సదరు అధికారి ఉండడం వల్లే ఆమెకు ఉద్యోగం లభించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకో ఉద్యోగి భార్య ఓ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ఈ అధికారిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఆయన పలుకుబడిని ఉపయోగించి తన భార్యకు ఉద్యోగం వేయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పట్టించుకోని యంత్రాంగం..

ఇద్దరు కీలక ఉద్యోగులు తమ భార్యలను ఉద్యోగాల్లో నియమించేందుకు కథ నడుపుతున్నారని అజ్ఞాతవ్యక్తుల నుంచి అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. రాయలసీమలోని ఓ జిల్లాకు బదిలీపై వెళ్లిన ఓ అధికారి శాఖాపరంగా ఉన్న పలుకుబడితో పాటు ఒక జిల్లా ఉన్నతాధికారి, ఓ రాజకీయ నేత పేర్లు ఉపయోగించుకుని తన భార్యకు ఉద్యోగం ఇప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఇంకో అధికారి తన పరపతిని ఉపయోగించుకుని భార్యకు ఉద్యోగం ఇప్పించబోతున్నారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. వీటిని పట్టించుకోకుండా నియామక ప్రక్రియ కానిచ్చేయడం గమనార్హం.

క్రిమినల్ చర్యలు చేపడతాం..

ఉద్యోగ నియామకాలు నిబంధనల ప్రకారమే జరిగాయి. కొంతమందిపై ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమే. వాటిపై దర్యాప్తు చేపట్టి... వాస్తవమైతే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. నియామక ఉత్తర్వుల్లోనూ ఈ విషయాన్ని పొందుపరిచాం. **-ఎం.ఎన్.రాణి, పీడీ, ఐసీడీఎస్**

ఆరోపణలు అవాస్తవం..

కుటుంబీకులకు ఉద్యోగం సంపాదించారంటూ కొంతమంది ఆరోపణలు చేస్తున్నారు. ఇది నూటికి నూరు శాతం అబద్ధం. నిబంధనల మేరకు మెరిట్ ప్రకారం ఉద్యోగాలు వచ్చాయి. కమిటీలో నేను సభ్యునిగా ఉన్నంత మాత్రాన అక్రమాలు జరిగాయని చెప్పడం దారుణం.

-సత్యనారాయణ, డీసీపీవో, పార్వతీపురం మన్యం జిల్లా

గ్రీన్ షాక్

తాత తండ్రుల నుంచీ గిరిశిఖర గ్రామాలపై పూరిళ్లలో మగ్గుతూ.. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ వచ్చిన ఆ గిరిజనం.. పక్కా ఇళ్లు మంజూరైతే సంబర పడిపోయారు. ఇన్నాళ్లకు తమ కష్టాలు ఒడ్డెక్కే రోజు వచ్చిందని సంతోషించారు. అప్పోసప్పో చేసి పనులు మొదలు పెట్టారు. కానీ 'గ్రీన్‌మార్క్' రూపంలో బిల్లులకు బ్రేక్ పడడంతో ఆందోళన చెందుతున్నారు. ఇదీ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో కొందరు గిరిజనుల పరిస్థితి.

(జియ్యమ్మవలస)



కొండచిలకాంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

- పీఎంఏవై ఇళ్లకు అందని బిల్లులు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- తలలు పట్టుకుంటున్న గృహ నిర్మాణ అధికారులు
- సమస్యను గుర్తించడంలో విఫలం

జిల్లాలో ఉన్న 15 మండలాల్లో 12 మండలాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) కింద 7,306 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో అత్యధికంగా జియ్యమ్మవలస మండలానికి 1,839 ఇళ్లు, కురుపాం మండలానికి 1,211, సీతంపేటకు 1,109 ఇళ్లు చొప్పున మంజూరయ్యాయి. అతి తక్కువగా కొమరాడ మండలానికి 8 ఇళ్లు, పాచిపెంట మండలానికి 70 మంజూరయ్యాయి. వీటిలో అధిక శాతం ఇళ్లకు బిల్లులు, సిమెంటును గృహ నిర్మాణ శాఖ అధికారులు అందిస్తూనే ఉన్నారు. కొన్ని ఇళ్లకు మాత్రం కనీసం ఒక్క బిల్లు కూడా మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గృహ నిర్మాణ శాఖ అధికారులను సంప్రదిస్తే.. 'ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం కనిపించడం లేద'ని వాపోతున్నారు. కారణం అవి 'గ్రీన్ మార్క్'లో ఉండిపోవడమే. బిల్లులు కనీసం అప్‌లోడ్ కావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఇదే విషయమై ఈ నెల 10న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో కొండచిలకాం పంచాయతీ గిరిజనులు అధికారులను నిలదీశారు. దీనికి సమాధానంగా గృహ నిర్మాణశాఖ అధికారులు ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పి... సరిపెట్టారు. అసలు ఈ గ్రీన్‌మార్క్ ఎందుకు వస్తోందో... కొందరి ఇళ్లకు మాత్రమే ఎందుకు కనిపిస్తోందో.. ఇది కనిపించకుండా ఏం చేయాలో... అధికారులకు కూడా స్పష్టత లేకపోవడం గమనార్హం.

ఇదీ పరిస్థితి..

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్)లో మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించి ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు మంజూరైన వాటిలో కొన్ని మాత్రమే గ్రీన్ మార్క్‌లో ఉండిపోయాయి. దీంతో లబ్ధిదారులకు బిల్లులు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నారు.

● జియ్యమ్మవలస మండలం కొండచిలకాం పంచాయతీలో మొత్తం 157 ఇళ్లు మంజూరయ్యాయి. 2022 అక్టోబరు 1న, అదే నెల 20న మంజూరైన మండంగి సుభాష్, నిమ్మక భోగమ్మ, నిమ్మక సుకవాసి, పువ్వల రత్నాలమ్మ, ఊయక రాధ, ఊయక గౌరమ్మలకు చెందిన ఇళ్లు గ్రీన్ మార్క్‌లో ఉండిపోయాయి. ● కురుపాం మండలం పెదగొత్తిలి పంచాయతీలో ఊయక లలిత, ఊయక చిన్నమ్మికి చెందిన ఇళ్లు గ్రీన్ మార్క్‌లో ఉండిపోయాయి. ● గుమ్మలక్ష్మీపురం మండలం జర్న పంచాయతీలో కిల్లక ఎల్లమ్మ, కిల్లక తాడమ్మ, ఊయక మిన్నారావుల ఇళ్లదీ ఇదే పరిస్థితి.

జిల్లాలోని అనేక గిరిజన ప్రాంతాల్లో ఇలాగే ఉంటోంది. వీరంతా గిరిశిఖర గ్రామాల్లో ఉన్నప్పటికీ సొంత ఇంటి కల నెరవేరుతుందనే ఆనందంలో అతి కష్టం మీద నిర్మాణ సామగ్రిని కొండలపైకి తీసుకెళుతున్నారు. ఇంటి పనులు చేపడుతున్నారు. బిల్లులు అందకపోవడంతో దిక్కులు చూడాల్సి వస్తోంది. గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్, ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని బిల్లులు సజావుగా అందేలా చూడాలని వీరు కోరుతున్నారు.

ఇదీ అన్యాయం..

పీఎంఏవై గ్రామీణ్ పథకంలో మాకు ఇళ్లు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు మొదలుపెట్టిన కొన్నాళ్లకు 'గ్రీన్ మార్క్'లో ఉండిపోయాయని.. బిల్లులు ఇవ్వలేకపోతున్నామని చెప్పడం అన్యాయం. మాకు న్యాయం చేయండి. **-సుమతి, ఎంపీటీసీ సభ్యురాలు, కొండచిలకాం**

ఉన్నతాధికారులకు నివేదించాం.

పీఎంఏవై గ్రామీణ్ పథకంలో మంజూరైన కొన్ని ఇళ్లు గ్రీన్ మార్క్‌లో ఉన్నాయి. బిల్లులు జనరేట్ చేసినా కావడం లేదు. దీనిని ఉన్నతాధికారులకు నివేదించాం. **-ఉమామహేశ్వరరావు, గృహ నిర్మాణశాఖ ఏఈ, జియ్యమ్మవలస**



సీతానగరం: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



పాలకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద..

భయపడేది లేదు

- సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం
- కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

బెలగాం, జనవరి 19: మొక్కవోని దీక్షతో సమ్మె చేస్తున్న తమపై ప్రభుత్వం ఎస్మా ప్రయోగించి షోకాజ్ నోటీసులు జారీ చేయడం దారుణమని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు పాల్పడినా భయపడేది లేదని, సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. నెల రోజులకు పైగా తమ సమస్యలు పరిష్కారం కోసం నిరసన దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి తమపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం మొండి వైఖరి వీడి అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు చేట్టాలని డిమాండ్ చేశారు. చిరు ఉద్యోగులమైన తమపై ఎస్మా చట్టం ప్రయోగించడం సబబు కాదని హితవు పలికారు. ఎస్మాను వెనక్కి తీసుకోవాలని కోరారు. సీఎం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు సాలూరు గౌరీమణి, మర్రాపు అలివేలు, జి.జ్యోతి, పాల్గొన్నారు. అంగన్‌వాడీలకు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వరులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, సీఐటీయూ నాయకులు వై.మన్మధరావు, జి.వెంకటరమణ, పాకల సన్యాసిరావు సంఘీభావం తెలిపారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

బకాయిలు చెల్లించాలి

- యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన

బెలగాం, జనవరి 19: ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రం పార్వతీపురంలోని చర్చి జంక్షన్ వద్ద ఉపాధ్యాయులు మోకాళ్ల మీద కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.18వేల కోట్ల ఉపాధ్యాయులకు బకాయిలు ఉన్నాయని, తమ అవసరాల కోసం దాచుకున్న డబ్బులను ఇవ్వమంటే ప్రభుత్వం ఇవ్వకపోవడం దారుణమన్నారు. తమ డబ్బును దారి మళ్లించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి చర్యలతో వివిధ శాఖల ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారని, ఉపాధ్యాయులు కూడా ధర్నా చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఐఆర్ 30 శాతం అమలు చేయాలని కోరారు.



మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల కూత

- అభివృద్ధికి నోచుకోని పార్వతీపురం టౌన్, పార్వతీపురం రైల్వే స్టేషన్లు
- ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్ ● మరుగుదొడ్లకు నిత్యం తాళాలు
- తాగునీటి సరఫరా అంతంతే ● ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు



పార్వతీపురంటౌన్ రైల్వే స్టేషన్


పార్వతీపురం టౌన్, జనవరి 19: దేశంలో ఎక్కడా లేని విధంగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో రెండు రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ఈ స్టేషన్లకు ఘన చరిత్ర ఉంది. 1904లో పార్వతీపురం రైల్వే స్టేషన్ ఏర్పడగా, మరో 20 ఏళ్ల తరువాత పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ ఏర్పడింది. ఈ రెండు స్టేషన్ల నుంచి ప్రతిరోజూ వివిధ ప్రాంతాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే, ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న స్టేషన్లు మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ రెండు చోట్లా సమస్యలు తిష్ట వేశాయి.

కానరాని సౌకర్యాలు..

పార్వతీపురం, పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ల మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు, పాసింజర్లలో ప్రతిరోజూ వెయ్యి నుంచి 2వేల మంది వరకు ప్రయాణికులు విశాఖ, విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. సంక్రాంతి, ఇతర పండగల సమయాల్లో 5 వేల నుంచి 10 వేల వరకు ప్రయాణిస్తుంటారు. దీంతో రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. అయినప్పటికీ స్టేషన్లలో కనీసం సౌకర్యాలు కల్పించడంలో రైల్వేశాఖ అధికారులు విఫలమయ్యారు. కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నిర్వహణ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ● టౌన్ రైల్వేస్టేషన్‌లో మరుగుదొడ్లతో పాటు తాగునీటి కుళాయిలు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లకు ఎప్పుడూ తాళాలు వేసే ఉంటాయి. దీంతో మహిళా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. తాగునీటి సదుపాయం కూడా అంతంత మాత్రంగానే ఉంది. దీంతో స్టేషన్ ఆవరణలోని దుకాణాల్లో వాటర్ బాటిళ్లు కొనుక్కోవల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఫ్యాన్ సౌకర్యం కూడా లేదు. ● పార్వతీపురం రైల్వే స్టేషన్‌లోని 2, 3 ప్లాట్‌ఫామ్‌లకు వెళ్లేందుకు నిర్మించిన ఓవర్ బ్రిడ్జి ఎక్కేందుకు వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడుతున్నారు. లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఓవర్ బ్రిడ్జి ఎక్కలేని వారు ప్రమాదమని తెలిసినా ప్లాట్‌ఫాం కిందకు దిగి రైలు పట్టాలు దాటి వెళ్లాల్సి వస్తోంది. రైలు బోగీలు ఎక్కడ నిలుస్తాయో తెలిపే డిస్‌ప్లే బోర్డుల్లో తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతుండడంతో రైలు ఎక్కే సమయంలో ప్రయాణికులు తికమకపడుతున్నారు. ఈ రెండు స్టేషన్లలో పచ్చని చెట్టు అనేది కనిపించకపోవడం రైల్వే అధికారులకు పర్యావరణంపై ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుంది.



పార్వతీపురం రైల్వేస్టేషన్ వంతెన మీద నుంచి రాలేక పట్టాలు దాటి బయటకు వెళ్తున్న ప్రయాణికులు



పార్వతీపురం రైల్వే స్టేషన్

ఇబ్బందులు పడుతున్నాం..

గత కొన్నేళ్లుగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నా. పార్వతీపురం రైల్వే స్టేషన్‌లోనే రైలు ఎక్కుతా. తాగునీటి కోసం ప్రయాణికులమంతా ఇబ్బందులు పడుతున్నాం. మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు. రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించాలి. **-జి.వెంకరమణ, ప్రయాణికుడు**

నరకం చూస్తున్నాం..

నేను ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు టౌన్ రైల్వే స్టేషన్‌కు వస్తుంటా. రైళ్ల కోసం వేచి ఉన్న సమయంలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించకపోవడం దురదృష్టకరం. మరుదొడ్ల గదులకు నిత్యం తాళాలు వేసి ఉంటాయి. దీంతో అత్యవసర సమయంలో మహిళా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. **బి.రమ, ప్రయాణికురాలు**

సౌకర్యాలు కల్పించాం..

పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాం. తాగునీరు, మరుగుదొడ్లు ఉన్నాయి. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాం. చిన్న చిన్న సమస్యలు సహజం. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడమే రైల్వే శాఖ లక్ష్యం. పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ నా పరిధిలో లేదు.

-పి.శ్రీనివాసరావు, పార్వతీపురం రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్

'కోడి కత్తి' శ్రీనుకి న్యాయం చేయాలి

- మద్దతుగా నిరసన తెలిపిన దళితులు, టీడీపీ నాయకులు
- సీఎంకు దళితులపై గౌరవమేదంటూ నిలదీత



రాజాం: నిరసన చేపడుతున్న కోండ్రు



విజయనగరం: మాట్లాడుతున్న అదితిగజపతిరాజు



విజయనగరంలో నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

విజయనగరం దాసన్నపేట, జనవరి 19: నాలుగున్నర ఏళ్లగా జైల్లో వున్న కోడికత్తి శ్రీనుకి న్యాయం చేయాలని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు కోరారు. టీడీపీ రాష్ట్రశాఖ ఆదేశాల మేరకు విజయనగరం టీడీపీ ఎస్సీ సెల్ విభాగం అధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి అదితి గజపతిరాజు, ఎస్సీ సెల్ నాయకులు మైలిపిల్లి పైడిరాజు, మామిడి రవిశంకర్‌తో పాటు, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, బొద్దల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, కంది మురళీనాయుడు, కర్రోతు నర్సింగరావు, బెవర భరత్‌తో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా అదితి గజపతిరాజు మాట్లాడుతూ, కోడి కత్తిశీను కేసు విషయంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి న్యాయస్థానానికి కూడా వెళ్లలేదన్నారు. దళితులపై దాడులు యథేచ్ఛగా జరుగుతున్నాయన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా తాము దళిత పక్షపాతి అని చెప్పుకునేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని, కానీ దళితులు, దళిత సంఘాలు జగన్‌ని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

విజయనగరం దాసన్నపేట: కోడికత్తి కేసులో అన్యాయంగా ఐదు సంవత్సరాల ఐదేళ్లుగా జైల్లో మగ్గిపోతున్న దళిత యువకుడు జనుపల్లి శ్రీను న్యాయం కోసం జైల్లో చేస్తున్న ఆమరణ దీక్షకు సంఘీభావంగా ఉత్తరాంధ్ర అంబేడ్కర్ రైట్స్ ప్రతినిధి డాక్టర్ పాండ్రంకి వెంకట రమణ ఆధ్వర్యంలో దళిత సంఘాలతో దీక్ష చేపట్టారు. అంబేడ్కర్ కూడలి సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో రమణ మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం దళితులపై బరి తెగించిందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోర్టుకి వచ్చి వాగ్మూలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు వీర్రాజు, ఉదయభాస్కర్, గోక రమేష్, సిద్దపల్లి దుర్గారావు, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ● **రాజాం:** సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళిత ద్రోహి అని, ఆయన పాలనలో దళితులు తీవ్రంగా దగా పడ్డారని మాజీ మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీ మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారంపాలకొండ రోడ్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. గత ఐదు సంవత్సరాలుగా బెయిల్ రాకుండా జైల్లోనే మగ్గిపోతున్న దళిత యువకుడు కోడి కత్తి శ్రీనును వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీల సాధికారత అంటే వారికి ఉపాధి అవకాశాలు కల్పించి, వారి నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం వంటివి చేయాలన్నారు. ఈ వైసీపీ ప్రభుత్వం అలాంటి చర్యలేవీ చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత లేదు

విజయనగరం దాసన్నపేట: రాజ్యాంగాన్ని చెత్త బుట్టలో పడేసిన నిరంకుశ పాలకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత లేదని జనసేన నాయకుడు గురాన అయ్యలు విమర్శించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ అధికారంలోకి వచ్చింది మొదలు నేటి వరకూ దళితులపై జరిగిన నేరాలు, ఘోరాలు లెక్కలేవన్నారు. విజయవాడలో భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినంత మాత్రాన ఆ పాపాలు పోవని, మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. దళితులు అంతా కలసికట్టుగా పోరాడి జగన్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

ఆసరాపై అవగాహన

లక్కవరపుకోట: ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అందిస్తున్న ఆసరా పథకంపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఏపీఎం అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం ఏరియా కోఆర్డినేటర్ ఎస్.ఆదయ్యతో కలిసి గొల్లాం, కొత్తపాలెం, రేగ గ్రామాల్లో మహిళలతో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఆసరా పథకాలను మహిళలు ఉపయోగించుకొని ఆర్థికస్వాలంబన పొందాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

విజయనగరం రింగురోడ్డు: జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాల, బోధనాసుపత్రిలో 20 కేటగిరీల్లో మొత్తం 63 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె పద్మలీల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు కేటగిరిలకు రివైజ్డు, రీ రివైజ్డుడ్ ప్రొబిషనల్ మెరిట్ జాబితా, నాలుగు కేటగిరీలకు సంబంధించి స్పీకింగ్ ఆర్డర్స్ జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపరిచామని, ఈ నెల 19, 20, 22 తేదీల్లో గ్రీవెన్స్ రీసీవ్డ్ ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించనుననట్టు పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర ఇంచార్జి చిన్న సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీనుమాదిగ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షుడుగా బంగారు దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా ఎందవ రవి, జిల్లా ఉపకార్యదర్శిగా కింతలి రాము, కోశాధికారిగ బల్లంకి కృష్ణ, అధికార ప్రతినిధిగా పొందూరు విజయ రామారావు, ప్రచార కార్యదర్శిగా గర్భాపు నరేష్, కార్యవర్గ అధ్యక్షుడిగా కనిగిరి చంటి, గౌరవ సలహాదారుగా ఎ.నాగేశ్వరావు, బి.శంకరావులతో పాటు యువజన విభాగంలో భాగంగా అధ్యక్షునిగా కింతల చంటి, ప్రచార కార్యదార్శిగా కింతల చిన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బోగి శ్రీను తెలిపారు.

బకాయిలు వెంటనే చెల్లించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రాజాం, జనవరి 19: రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు బకాయిపడ్డ పీఎఫ్, పీఆర్సీ, డీఏ, ఎస్ఎల్‌లు సుమారు రూ.10వేల కోట్ల వరకూ ఉన్నాయని, ప్రభుత్వం తక్షణమే వాటిని విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పోరాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజాం తాలూకా కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేము నెల నెలా దాచుకున్న డబ్బులు మాకు చెల్లించడానికి తాత్సారం దేనికని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శ్రీకాకుళం రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా బొబ్బిలి రోడ్డు కూడలి వరకూ నల్ల రిబ్బన్లు కట్టుకొని ర్యాలీ చేపట్టారు. అనంతరం పాలకొండ రోడ్డు కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి పక్కి వాసు, బాణాన రామినాయుడు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఏఏజీ పొన్నవోలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు



మాట్లాడుతున్న టీడీపీ లీగల్ సెల్ నాయకులు

విజయనగరం రూరల్, జనవరి 19: ఏఏజీ పొన్నవోలు సుధాకరరెడ్డి ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని, చంద్రబాబు స్కిల్ కేసులో ఆయన న్యాయానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉపాధ్యాయుల రవిశంకర్, లీగల్ సెల్ ప్రతినిధి ఏఏ రాజు చెప్పారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఏఏజీ పొన్నవోలు వ్యాఖ్యలను ఖండించారు. ద్విసభ్య ధర్మాసనం తీర్పు మీద ఏఏజీ పొన్నవోలు చంద్ర బాబు విషయంలో అవాస్తవాలు చెబుతున్నారన్నారు. 53 రోజుల్లో చంద్రబాబుపై ఆరోపణలు నిరూపించలేకపోయారన్నారు. స్కిల్ కేసు విషయంలో చంద్ర బాబు 53 రోజులు జైల్లో ఉన్న సందర్భంలో రాజకీయ నాయకుడి మాదిరిగా హైదరాబాద్, డిల్లీలో ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడారని, ఎవరి మెప్పు కోసం పొన్నవోలు ఈ విధంగా మాట్లాడుతున్నారో ప్రజలకు అర్థమయిందన్నారు. ఇక నైనా పొన్నవోలు తప్పుడు ప్రకటనలు చేయకుండా న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడాలన్నారు. టీ డీపీ లీగల్ సెల్ నాయకులు ఈశ్వరరావు, యువీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

వేపాడ, జనవరి 19: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారీపై సర్పంచ్, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని మండల ఈవోపీఆర్డీ ఉమ అన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి, శానిటేషన్, తాగునీటి వసతి, కాలువల నిర్మాణం, సిబ్బంది జీతభత్యాలు చెల్లింపులు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ కస్తూరి, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరి వాడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జడ్పీ సీఈవో

విజయనగరం (ఆంధ్రజ్యోతి) జనవరి 19: బడుగుబలహీన వర్గాల ప్రజ లందరికీ సమన్యాయం జరిగి, వారు ఆర్థికంగా ఎదగాలని అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందనే భావం రాజ్యంగాని రచించిన అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అమలు చేసే విధంగా ప్రతిజ్ఞ బూనాలని జడ్పీ సీఈవో రాజ్‌కుమార్, డీపీవో శ్రీధర్ అన్నారు. సామాజిక సమతా సంకల్ప మహోత్సవంలో భాగంగా జడ్పీ ఆవరణలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జడ్పీ, పంచాయతీరాజ్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. డీఎల్‌డీవో నిర్మల, ఎం.వేదావతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని కులగణన కార్యక్రమం బాధ్యతగా చేపట్టాలని కమిషనర్ నాగరాజు ఆదేశించారు. శుక్రవారం పురపాలక సంఘం కార్యాలయంలో నోడల్ అధికారులు, సచివాలయ అడ్మిన్‌లతో సమావేశం నిర్వహించారు. కులగణన చేసే విధానంపై వారికి వివరించారు. ఈ కార్యక్రమానికి వలంటీర్ల సహకారం తీసుకోవాలే తప్ప బాధ్యత మాత్రం సెక్రటరీలదేనన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సమాచార సేకరణ పత్రాలు పూర్తిగా భర్తీచేయాలన్నారు. ఈ నెల 27లోగా కులగణన పూర్తి చేయాలన్నారు. 28తేదీ నుంచి ఫిబ్రవరి 2 వరకు మ్యాపింగ్ కార్యక్రమం చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడ్డివలస, సీహెచ్ బొడ్డవలస, గోపాలరాయుడి పేట తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న కులగణన సర్వే ప్రక్రియను ఎంపీడీవో రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి పక్కాగా ఈ సర్వే నిర్వహించాలని సచివాలయ సిబ్బందికి వలంటీర్లకు ఆదేశాలిచ్చారు. అనంతరం పారాదిలో వికసిత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తెలగ కులస్థులను బీసీలో చేర్చాలి



విజయనగరం, లక్కవరపు కోట తహసీల్దార్ కార్యాలయాలవద్ద వినతి పత్రాలతో సంఘ నాయకులు

దాసన్నపేట: ఉత్తరాంధ్రలో తెలగ కులస్థులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని తక్షణమే బీసీలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం ప్రతినిధి పల్లంట్ల వెంకట రామారావు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఉత్తరాంధ్రలో అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందించారు. విజయనగరం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో వేలాది కుటుంబాలు ఉపాదిలేక వలస కూలీలు వెళ్లాల్సి పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సంఘప్రతినిధులు పాల్గొన్నారు. ● **లక్కవరపుకోట:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలగా జాతిని బీసీల్లో కలిపి వారి ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు ప్రభుత్వం సహకరించాలని తెలగాల నాయకుడు కూరాకుల సూర్యారావు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక తెలగా నేతలతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. తెలగాలు ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. 1962కు ముందు తెలగాలకు రిజర్వేషన్ ఉండేదని, పుట్టస్వామి, మంజునాథ కమిషన్లు తెలగాలకు రిజర్వేషన్లు కల్పించాలని చెప్పినట్టు తహసీల్దార్‌కు వివరించారు. శ్రీను, చిన్నా తదితరులు ఉన్నారు.

టోసా గోగు సాగుకు కసరత్తు

- ఐకార్ పథకంలో వెయ్యి ఎకరాల్లో పంటకు ప్రోత్సాహకాలు
- కనుమరుగవుతున్న భీమిలి రకం పంట

బొబ్బిలి

ఉత్తరాంధ్ర ప్రాంతం ఒకప్పుడు గోగు పంట ఉత్పత్తికి పెట్టింది పేరుగా ఉండేది. ఇప్పుడు ఆ పంట పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితుల్లో జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 'ఐకార్' పథకంలో భాగంగా 'టోసా' రకం గోగు పంట సాగును ఈ ప్రాంతంలో విస్తరింపజేసేందుకు కార్యాచరణ రూపొందిస్తోంది. జాతీయ జూట్‌బోర్డు ఆధ్వర్యంలో బెంగాల్, అసోం ప్రాంతాల్లో పండించే టోసా రకం గోగు పంట సాగును ఈ ప్రాంతం వారికి పరిచయం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే బొబ్బిలి మండలం కలవరాయి గ్రామంలో ప్రయోగాత్మకంగా ఎకరన్నర భూమిలో ఈ పంటను సాగు చేశారు. మంచి ఫలితాలు రావడంతో రైతులందరినీ ఈ పంట సాగు వైపు మొగ్గు చూపించేలా అవసరమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఆసక్తి గల రైతులను గుర్తించి వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సుమారు ఏడేళ్ల తరువాత జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (జేసీఐ) ఆధ్వర్యంలో ఇటీవల బొబ్బిలి జూట్ టెక్నాలజీ మిషన్‌లో కొనుగోలు కేంద్రాన్ని తెరిచారు. గతంలో బలిజిపేట, డొంకినవలస, గజపతినగరం, చీపురుపల్లి, మక్కువ, పొందూరు, పార్వతీపురం తదితర ప్రాంతాల్లో జూట్ కొనుగోలు కేంద్రాలు నడిచేవి. ప్రైవేట్ వ్యాపారులవి తప్ప జేసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు పూర్తిగా మూతపడ్డాయి. ఓ విధంగా మరుగున పడ్డాయి. ప్రస్తుతం బొబ్బిలిలో ఒక్క దగ్గర మాత్రమే కొనుగోలు కేంద్రాన్ని తెరిచారు.

భీమిలి కన్నా లాభదాయకం..

ప్రస్తుతం ఈ ప్రాంతంలో భీమిలి రకం జనపనార పండిస్తున్నారు. ఇది దృఢంగా ఉంటుంది. కానీ దిగుబడి ఖర్చులు అధికం. మార్కెట్ సౌకర్యాలు కూడా అంతంతమాత్రమే. గోనె సంచి బరువును కిలో నుంచి ఇంకా తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంతో భీమిలి జూట్ స్థానంలో టోసా రకాన్ని రైతులతో సాగు చేయించాలని జేసీఐ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో గోగు పంట సాగు తగ్గి పోవడమే కాక, జూట్‌మిల్లులు కూడా పూర్తిగా మూతపడి రియల్‌ఎస్టేట్ పరమవుతున్నాయి. కేవలం ఐదు జూట్‌మిల్లులు మాత్రమే జిల్లాలో పనిచేస్తున్నాయి. టోసా జూట్‌తో తయారు చేసే గోనె సంచి బరువు అరకిలోకన్నా తక్కువగా ఉంటుంది.

● భీమిలి రకం జూట్ క్వింటాలు ధర 2,900 రూపాయల నుంచి 3375 రూపాయల వరకు పలుకుతోంది. అదే టోసా రకం జూట్ ధర క్వింటాలు 5,800 రూపాయల వరకు పలుకుతుంది. మార్కెట్‌లో ఈ జూట్‌కు గిరాకీ కూడా ఉంటుంది. మొక్కజొన్న, తదితర వాణిజ్య పంటల వైపు మళ్లుతున్న రైతులను టోసా రకం జూట్ సాగు చేపడితే లాభదాయకంగా ఉంటుందని అధికారులు రైతులకు నచ్చజెబుతున్నారు.



మిర్తివలసలో చేపట్టిన పంట



రైతుల నుంచి కొనుగోలు చేసిన జూట్

కార్యాచరణ రూపొందించాం..

- రామ్‌కిరణ్, అరుణ్, రామ్‌ప్రసాద్, జేసీఐ అధికారులు

నేషనల్ జూట్ బోర్డు ద్వారా ఐకార్‌లో టోసా రకం జూట్ పంట సాగు కోసం రైతులను ప్రోత్సహించనున్నాం. ఇందుకోసం కార్యాచరణ రూపొందించాం. ప్రయోగాత్మకంగా చేపట్టిన పంటసాగు విజయవంతం అయింది. జూట్ టెక్నాలజీ మిషన్ ద్వారా కార్యకలాపాలను మళ్లీ ప్రారంభించాం. ఈ ప్రాంతంలో గణనీయంగా పడిపోయిన గోగు పంట సాగుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి జరుగుతోంది. కిలో గోగు విత్తనాలను 150 నుంచి 200 రూపాయలకు సబ్సిడీపై అందించనున్నాం. మార్చి, ఏప్రిల్‌లో రైతులకు సబ్సిడీపై గోగు విత్తనాలను సరఫరా చేయనున్నాం. ఈ జూట్ ధర చాలా లాభదాయకంగా ఉంటుంది. దీని సాగు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు మాస్టర్ ట్రైనీల ద్వారా శిక్షణ ఇస్తాం. రైతులు అలవాటు పడితే ఈ పంట సాగును అభివృద్ధి చేస్తారు.

అనుమానిస్తున్నాడని అంతం చేసింది

● భర్తను హత్య చేసిన భార్య ● పోలీసుల విచారణలో వెల్లడి

సాలూరు రూరల్, జనవరి 19: తనను అనుమానిస్తూ... వేధిస్తున్నాడని విసుగు చెంది భర్తను మహిళ హతమార్చినట్టు విచారణలో తేలిందని సాలూరు రూరల్ సీఐ ఎస్.ధనంజయరావు చెప్పారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జీగిరాంలో సీహెచ్ తిరుపతి (43) అనుమానాస్పదంగా మృతి చెందినట్టు కేసు నమోదు చేశామన్నారు. అనంతరం భార్య సుగుణను విచారించామన్నారు. ఈ విచారణలో ఆమె తన భర్తను హత్య చేసినట్టు తెలిసిందన్నారు. తిరుపతి రోజూ మద్యం తాగి వచ్చి భార్యపై అనుమానంతో గొడవ పడుతుండేవాడన్నారు. ఆయన బుధవారం రాత్రి మద్యం తాగి వచ్చి మరోసారి గొడవ పడ్డాడన్నారు. మద్యం మత్తులో ఉండగా అతని మర్మావయవాలపై దాడి చేయడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడన్నారు. అనంతరం గొంతు నులిమి వేయడంతో తిరుపతి మృతి చెందాడడని చెప్పారు. దీనిని హత్య కేసుగా నమోదు చేశామన్నారు.

జలపాతంలో పడి యువకుడి మృతి

పాచిపెంట, జనవరి 19: ఆలూరు సమీపంలో గల సంకెళ్ల గుమ్ములో పడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. శుక్రవారం మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసుల కథనం ప్రకారం రామభద్రపురం మండలం నేరళ్లవలసకు చెందిన కాదల ప్రదీప్ (15) చెరుకుగుడ్డిలో గల బంధువుల ఇంటికి ఇటీవల వెళ్లాడు. బుధవారం సరదాగా సంకెళ్ల గుమ్ము జలపాతం వద్దకు వెళ్లాడు. నీటిలో ఆటలాడుతూ గల్లంతయ్యాడు. ఈ మేరకు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్ఐ నారాయణరావు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయానికి మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తామరాపల్లిలో గుర్తు తెలియని మృతదేహం

లక్కవరపుకోట, జనవరి 19: గుర్తుపట్టలేని స్థితిలో ఉన్న మృతదేహం బయటపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తామరాపల్లి గ్రామంలో శుక్రవారం మృతదేహం లభ్యమైనట్టు సమాచారం రావడంతో ఎస్.కోట సీఐ షణ్ముఖరావుతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి చూడగా సుమారు వారం రోజుల కిందట మృతి చెందిన మహిళ శరీరం, గుర్తించడానికి వీలు లేకుండా పడి ఉందని తెలిపారు. మృతదేహం వద్ద గోనె సంచులు, ప్లాస్టిక్ బాటిళ్లు ఉన్నాయని, ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రోజూ కొండకు వస్తున్న పశువుల కాపర్లు, చీపురుపుల్లలు సేకరించేవారి నుంచి సమాచారం సేకరిస్తున్నట్టు తెలిపారు. ఎస్.కోట నుంచి వైద్యులను రప్పించి ఘటనా స్థలం వద్దే పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

రేగిడి, జనవరి 19: మండలంలో కొర్లవలస గ్రామంలో ఎన్నికల విధుల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన సోదాల్లో ఒక కిరాణాషాపు యజమాని నుంచి 30 మద్యంసీసాలతో పట్టుబడినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా, నిందితుడిని పట్టుకొని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బొబ్బిలి: పట్టణ పరిధిలోని మల్లమ్మపేట గ్రామంలో మద్యం అమ్ముతుండగా కర్రి కాశమ్మ శుక్రవారం రాత్రి పట్టుబడినట్లు సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. హెచ్‌సీ వి.మంగమ్మ, ఇతర సిబ్బంది నిఘా పెట్టి మద్యం అమ్ముతున్న కాశమ్మను అదుపులోకి తీసుకుని 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

అనారోగ్యంతో పదో తరగతి విద్యార్థి మృతి

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన పదో తరగతి విద్యార్థి మద్దిల శశివర్ధన్ (14) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. శశివర్ధన్ సతివాడ ఆదర్శ పాఠశాలలో చదువుతున్నాడు. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మలత, సిబ్బంది విద్యార్థి మృతికి నివాళులు అర్పించారు.

ఘనంగా ముత్యాలమ్మ తీర్థం

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట గ్రామ ప్రజల ఆరాధ్య దేవత ముత్యాలమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం వైభవంగా జరగింది. గ్రామ ప్రజలు అమ్మవారిని వేకువజాము 5 గంటల నుంచి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడమే కాకుండా భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. నిర్వహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

తైక్వాండోలో పతకాలు

బొబ్బిలి: విజయనగరం విజ్జీ స్టేడియంలో ఈ నెల 13 న జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బొబ్బిలికి చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. ఎన్.వంశీకృష్ణ, బంగారు పతకాన్ని సాధించగా, టి.లిఖితారావు, రేష్మ, రిషిక్ సాయి, భరత్‌కుమార్, క్రితిన్‌లు సిల్వర్ మెడల్స్‌ను, మోహన్, లక్ష్య జైన్, జ్ఞానదీపిక, హర్షిత్‌రాము బ్రాంజ్ మెడల్స్‌ను సాధించినట్లు తైక్వాండో సీనియర్ కోచ్ సుధాకర్‌యాదవ్ తెలిపారు. వీరందరినీ స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు అభినందించారు.

డ్రైవర్లు తగిన విశ్రాంతి తీసుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: ఆర్టీసీ డ్రైవర్లు తమకు విధులు లేని సమయంలో పూర్తి స్థాయిలో విశ్రాంతి తీసుకోవాలనీ డిపోమేనేజర్ రమేష్ తెలిపారు. స్థానిక డిపోలో నిర్వహిస్తున్న రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణకు డ్రైవర్లు పాటించాల్సిన అంశాలను వివరించారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తామని డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

సిమెంట్ లెక్కలపై స్పష్టత ఏదీ?

జీపీడీపీ సమావేశంలో తీవ్ర చర్చ



జీపీడీపీ సమావేశం దృశ్యం

రేగిడి, జనవరి 19: మండలంలో లెక్కతప్పిన సిమెంట్ బస్తాలపై సందిగ్ధత కొనసాగుతోంది. సచివాలయం, ఆర్‌బీకే, ఇతర ప్రభుత్వ భవనాలు, ఎన్ఆర్ఈజీఎస్ రోడ్లుకు సంబంధించి 2019లో మండలానికి సరఫరా అయిన 52వేల బస్తాల్లో వందల బస్తాల లెక్కలు తేలకపోవడంపై ఆంధ్రజ్యోతి కథనాలు ప్రచురించింది. దీనిపై ఇటీవల కాలంలో మండలంలో తీవ్రచర్చ నడిచింది. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రెండు రోజుల జీపీడీపీ ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీపీడీపీ చర్చ అనంతరం సిమెంట్ సరఫరా తేడాలు, హౌసింగ్ బిల్లుల చెల్లింపు జాప్యంపై వైస్ఎంపీపీ జగన్మోహనరావు, ఎంపీడీవో శ్యామలాకుమారి నేతృత్వంలో చర్చ జరిగింది. ప్రధానంగా సిమెంట్ లెక్కలు తేల్చకపోవటంపై పలు గ్రామాల సర్పంచులు ఈ సమావేశానికి హాజరైన పంచాయతీరాజ్ ఏఈ రామకృష్ణని నిలదీశారు. వైస్ఎంపీపీ, ఎంపీడీవో కల్పించుకొని రెండురోజుల్లో లెక్కలు తేల్చాలని ఏఈని ఆదేశించారు. దీనిపై ఏఈ వివరణ ఇస్తూ ఇప్పటికే ఐదు పంచాయతీల నేతలకు నోటీస్‌లు ఇచ్చినట్లు, మిగితా పంచాయతీల వివరాలు అంచనా వేసినట్లు వెల్లడించారు. అంబాడ సచివాలయానికి దాదాపు 2వేలు బస్తాలు రావల్సి ఉందని, ఇవి మూడు సచివాలయాలకు అప్పట్లో సర్దుబాటుచేయుగా, ఈసచివాలయం నుంచి వేరే సచివాలయానికి 700 బస్తాలు ఇవ్వాల్సి ఉందని అక్కడ ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్‌తో ఏఈకి రాతపూర్వకంగా నివేదించామన్నారు. ఇలా లెక్కతప్పిన సిమెంట్ దాదాపు 10వేలు బస్తాలు ఉండొచ్చుని ఏఈ ఆంధ్రజ్యోతికి ప్రాథమిక అంచనాగా వెల్లుడించారు.

● ఇదే సమావేశంలో హౌసింగ్‌బిల్లుల జాప్యంపైన నేతలు హౌసింగ్ ఏఈ జగన్మోహనరావుని నిలదీశారు. గతంలో ఒకటి రెండు బిల్లులు చెల్లించి తదుపరి బిల్లుల చెల్లింపుల్లో జాప్యం ఎందుకు అని వైస్ఎంపీపీతో పాటు, పలుగ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు గట్టిగా ప్రశ్నించారు. బిల్లుల చెల్లింపులో జాప్యానికి కారణమైన ఇంజినీరింగ్ అసిస్టెంట్లపైన నేతలు విరుచుకుపడ్డారు. దీనిపై తక్షణమే బిల్లులు చెల్లించేలా, సమస్యలేకుండా చూడాలని ఎంపీడీవో హౌసింగ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. అంతకముందు గ్రామపంచాయతీ, మండలపరిషత్ అభివృద్ధి ప్రణాళికపై నేతలు సుదీర్ఘచర్చ నిర్వహించారు. ఈవోపీఆర్డీ సత్యనారాయణ ఉన్నారు.

టీడీపీ నేతలు వాస్తవాలు మాట్లాడాలి

శృంగవరపుకోట రూరల్: తమ పంచాయతీలో ఉన్న చిట్టంపాడు గురించి టీడీపీ నేతలు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని పంచాయతీ సర్పంచ్ దేవాపురపు మీనా, ఎంపీటీసీ లగుడు లక్ష్మి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడుకు ఉపాధి హామీ నిధుల్లో భాగంగా రోడ్డుకు రూపకల్పన చేస్తున్నామని, ప్రస్తుతం ఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్తున్నాయన్నారు.

దళిత ద్రోహి జగన్

- ఆయన విగ్రహాన్ని తాకే అర్హత సీఎంకు లేదు
- అరకులో 'రా...కదలిరా'ను విజయవంతం చేయండి
- టీడీపీ నాయకుల పిలుపు


మాట్లాడుతున్న విజయచంద్ర

పార్వతీపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దళితద్రోహి అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అంబేడ్కర్ వి గ్రహాన్ని దళితులపై ఉన్న అభిమానంతో నిర్మించామని చెప్పిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని నమ్మరన్నారు. వైసీపీ పాలనలో దళిత మహిళలపై ఎన్నో అత్యాచారాలు జరిగాయన్నారు. తన వద్ద పనిచేసిన దళిత యువకుడిని హత్య చేసి వారి ఇంటికి పార్సిల్ పంపిన ఎమ్మెల్సీ అనంతబాబుపై వైసీపీ తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో శనివారం జరగనున్న రా..కదలిరా కార్యక్రమాన్ని కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, నాయకులు బోను దేవీ చంద్రమౌళి, మజ్జి వెంకటేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ పాలకుడు జగన్


మాట్లాడుతున్న గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు: అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత సీఎం జగన్‌కు లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. అరకులో ఈ నెల 20న (శనివారం) టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తలపెట్టిన 'రా కదలిరా' సభను విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలోని తన నివాసం వద్ద శుక్రవారం స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత జగన్‌కు లేదని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ప్రేమించిన మహానుభావుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆయన అందించిన రాజ్యాంగాన్ని చెత్తబుట్టలో పడేసిన నిరంకుశ పాలకుడు జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. 'అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి' పథకంలో ఆ మహోన్నతుడి పేరును మార్చి తన పేరు పెట్టుకున్నారని...ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని విగ్రహావిష్కరణకు సిద్ధపడ్డారని ప్రశ్నించారు. కోడి కత్తి కేసులో కోర్టుకు హాజరుకాకుండా జగన్‌రెడ్డి దళిత బిడ్డ శ్రీను జీవితాన్ని నాశనం చేస్తున్నాడని అన్నారు. ఈ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ముఖ్య కార్యదర్శి ముఖీ సూర్యనారయణ, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పరమేష్, గుడేపు యుగంధర్, పిన్నింటి ఈశ్వరరావు, హర్షవర్ధన్ కునిశెట్టి భీమారావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు తరలివెళ్లాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జగదీశ్వరి

జియ్యమ్మవలస: చంద్రబాబు అరకులో శనివారం తలపెట్టిన రా.. కదలిరా సభకు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తరలివెళ్లాలని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. శుక్రవారం కురుపాం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా మాజీ మంత్రి శత్రుచర్ల, నియోజక వర్గ పరిశీలకులు ఆరేటి మహేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి, జనసేన పార్టీ సమన్వయకర్త కద్రక మల్లేష్‌లు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వైసీపీ కోడి కత్తి డ్రామాకు బలై జైలులో మగ్గుతున్న అమాయక దళితుడు శ్రీనును తక్షణమే కేసు నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ శ్రేణులతో కలిసి నిరసన చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

పాలకొండ: టీడీపీ ప్రభుత్వం వస్తేనే బీసీల అభివృద్ధి ఉంటుందని పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని టి.డి.పారాపురం గ్రామంలో భాగంగా శుక్రవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా బీసీలంటూ సీఎం జగన్మోహన్‌రెడ్డి మళ్లీ మోసం చేయడానికి సిద్ధపడ్డారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీల అభివృద్ధి శూన్యమన్నారు. చంద్రబాబు బీసీల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని జయకృష్ణ గుర్తు చేశారు.

టీడీపీలో చేరిన సంగంనాయుడు..

బుక్కూరు గ్రామానికి చెందిన తోటపల్లి ప్రాజెక్టు వైస్ చైర్మన్ బొత్స సంగంనాయుడు వైసీపీని వీడి శుక్రవారం టీడీపీలో చేరారు. సంగంనాయుడుకు జయకృష్ణ పార్టీ కండువాను వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కిమిడి రాంమల్లిక్ నాయుడు, కర్నేన అప్పలనాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కలమట సాగర్, మాజీ జెడ్పీటీసీ అనెపు రామకృష్ణ, అరకు పార్లమెంటరీ బీసీ సెల్ కన్వీనర్ పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు అంపిలి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జయకృష్ణ

కులగణనకు కొండ దిగాల్సిందే

- సిగ్నల్ కోసం గిరిశిఖర గ్రామం నుంచి వచ్చిన గిరిజనులు


సిగ్నల్ కోసం కొండ దిగి మోనంగి వచ్చిన గిరిజనులు

సాలూరు రూరల్, జనవరి 19: కుల గణనలో తమ వివరాలు నమోదు చేసుకోవాలని గిరి శిఖర గిరిజనులు సిగ్నల్ పాయింట్ కోసం కొండ దిగి వచ్చారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైంది. జిల్లాలో 451 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. గణన పది రోజుల పాటు జరగనున్నట్టు ఈవోపీఆర్డీ ప్రసాద్ తెలిపారు. సాలూరు మండలంలో గిరి శిఖర గ్రామాలు ఉన్నాయి. వాటికి సిగ్నల్ సమస్య ఉంది. కులగణనలో కుటుంబ యాజమానితో పాటు పర్యవేక్షణ అధికారి, వలంటీర్ వేలిముద్ర (బయోమెట్రిక్ థంబ్) వేయాల్సి ఉంది. దీంతో సిగ్నల్ అందే చోటుకు వారిని రప్పించి నమోదు చేయాల్సిన పరిస్థితి ఉంది. కొదమ పంచాయతీకి చెందిన కొందరిని తొలి రోజు సిగ్నల్ వచ్చే కొండ దిగువ ఉన్న మోనంగి గ్రామానికి రప్పించారు. అక్కడే వేలిముద్ర వేయించారు. ఈ విషయమై సాలూరు ఈవోపీఆర్డీ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.... కులగణనలో పారదర్శకత కోసం ముగ్గురి బయోమెట్రిక్ వేయాల్సి ఉందన్నారు. ఆఫ్ లైన్ సర్వే కూడా చేస్తున్నామన్నారు.

లక్ష్యాలను సాధించాలి


నూతన జీసీసీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సహకార మార్కెటింగ్ సొసైటీలో విధులు నిర్వహిస్తున్న సేల్స్‌మేన్లు, డీలర్లు, సిబ్బంది లక్ష్యాలను సాధించాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ అన్నారు. శుక్రవారం ఆయన గుమ్మలక్ష్మీపురం బ్రాంచి కార్యాలయానికి వచ్చిన సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. నిత్యావసర వస్తువుల అమ్మకాలు, అటవీ ఉత్పత్తుల కొనుగోలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ అమ్మకాలలో లక్ష్యానికి అనుగుణంగా చేరేలా కృషి చేయాలన్నారు. వచ్చే జూలై నుంచి పార్వతీపురం డివిజన్ పరిధిలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సాలూరు నుంచి తమ వాహనాల ద్వారా నిత్యావసర సరుకులను రవాణా చేస్తామన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన జీసీసీ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట బ్రాంచి మేనేజర్ కృష్ణ ప్రసాదరావు, అకౌంటెంట్ గణపతిరావు, గోదాం ఇన్‌చార్జి సాంబశివరావు, సిబ్బంది ఉన్నారు.

మంచి మార్గాన్ని అనుసరించాలి



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

పాలకొండ: ప్రతి మనిషి మంచి మార్గాన్ని అనుసరించాలని శ్రీకాకుళం జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పాలకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి ఎ.విజయరాజకుమార్‌తో కలిసి పాలకొండ సబ్‌జైలును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. ఆహారం, సదుపాయాలపై ఆరా తీశారు. సబ్‌జైలు పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, న్యాయవాది ఎం.వెంకటేశ్వరరావు, హెడ్‌వార్డర్లు పి.చంద్రరావు, విజయ్ కుమార్, పి.మధు, నరసింహులతో పాటు కోర్టు సిబ్బంది, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

చేతి వృత్తుల వారికి వరం విశ్వకర్మ యోజన

ఒడిశా



వేదికపై నిహార్ రంజన్, పట్నాయక్, మిశ్రా తదితరులు

రాయగడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వకర్మ యోజన పథకం చేతివృత్తుల వారికి ఓ వరమని జిల్లా పరిషత్ కార్యనిర్వాహక అధికారి నిహార్ రంజన్ కోహర్ అన్నారు. ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం స్థానిక హోటల్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకం విధి విధానాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐపీఓ సవ్యసాచి నాయక్, ఎం.ఎస్.ఎం.ఇ. డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కోటిరత్నం, విశ్వకర్మ యోజన సభ్యులు శివ పట్నాయక్, కిషోర్‌చంద్రపండా, లీడ్ బ్యాంక్ మేనేజర్ బావ్‌రంజన్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ క్షేత్రానికి ఏసీ బస్సు సర్వీసులు



రాయగడ: రాష్ట్రంలోని వివిధ నగరాల నుంచి శ్రీక్షేత్రం పూరీ జగన్నాథ సన్నిధికి భక్తులు చేరుకునేందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శ్రీ జగన్నాథ ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులను ప్రవేశ పెట్టారు. జగన్నాథుని భక్తులకు ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక శాసన సభ్యుడు మకరంద ముదిలి అన్నారు. శ్రీ జగన్నాథ ఎక్స్‌ప్రెస్ బస్సు యోజన కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వర్చువల్ ద్వారా ప్రారంభించారు. రాయగడలో రవాణా శాఖాధికారి శివశంకర్ చౌదురి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. 51 మంది ప్రయాణికులు కూర్చునే సామర్థ్యం గల ఈ బస్సులను తొలివిడతలో రాయగడ, బలంఘీర్, నవరంగపూర్, జైపూర్, పర్లాఖిముండి, సుందర్‌ఘడ్ తదితర 12 ప్రాంతాల నుంచి నడపనున్నారు. కార్యక్రమంలో ఫైవ్‌టీ చైర్మన్ వి.ఎ.పాండ్యన్, సబ్‌కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి, అదనపు జిల్లా ఎస్పీ విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం


క్రీడాపోటీల్లో పాల్గొంటున్న అథ్లెటిక్స్

రాయగడ: స్థానిక జీసీడీ క్రీడా మైదానంలో నువా- ఓ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర మంత్రి జగన్నాథ సారక, స్థానిక శాసన సభ్యుడు మకరంద ముదిలి, ప్రత్యేక అభివృద్ధి మండలి అధ్యక్షురాలు అనసూయ మాఝి, నువా ఒడిశా జిల్లా కోఆర్డినేటర్ పట్నాన గౌరీఈశంకరరావు తదితరులు ప్రారంభించారు. 11 సమితుల నుంచి సుమారు 1600 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

గుండెపోటుతో పాత్రికేయుడు మృతి

రాయగడ: గుండెపోటుతో ఒడియా న్యూస్‌చానల్ విలేకరి గజమోహన్ గరడియా (38) అనే పాత్రికేయుడు మృతి చెందాడు. గత రెండు రోజులుగా అస్వస్థతతో ఉన్న ఆయన వైద్యులను సంప్రందించేందుకు విశాఖపట్నం వెళ్లాడు. ఆసుపత్రిలో చేరిన తర్వాత చికిత్స పొందుతూ గుండెపోటు రావడంతో మృతి చెందాడు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

జిల్లాలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతుంది. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 39వ రోజు శుక్రవారం ఆందోళన చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగం సాక్షిగా నాడు మహిళల హక్కులను కాపాడితే.. నేడు ముఖ్యమంత్రి జగన్ వారి హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అధికారులు ఇచ్చిన మెమోకు ప్రతిగా సమాధానాలు ఇస్తూ తమకు న్యాయం జరిగే వరకు విధుల్లో చేరేది లేదని తేల్చి చెప్పారు.

\- ఆంధ్రజ్యోతి బృందం


సాలూరు: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


భామినిలో..


సీతంపేటలో..

అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి: కలెక్టర్

పార్వతీపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం గిరిమి త్ర భవనంలో సాంఘిక సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన సామాజిక సేవా సంకల్ప సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉదయం సెయింట్ పీటర్స్ పాఠశాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు మారథాన్, మానవహారం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరం ప్రాంగణంలో అంబేడ్కర్ జీవితచరిత్ర, ముఖ్య ఘట్టాలను తెలిపే ఛాయాచిత్ర ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబాసాహెబ్ జీవితంపై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, పంచాయతీరాజ్ ఈఈ కృష్ణాజీ, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.డి.గయాజుద్దీన్, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఛాయాచిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్, జేసీ, ఐటీడీఏ పీవో

బీసీ రిజర్వేషన్ కల్పించాలి


ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న తెలగ కుల ప్రతినిధులు

గరుగుబిల్లి: తెలగ కులస్థులకు బీసీ రిజర్వేషన్ కల్పించాలని ఉప తహసీల్దార్ పి.సత్యలక్ష్మికుమార్‌కు వినతిపత్రం అందించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండల ప్రతినిధులు పి.చంద్రశేఖరరావు, కె.రమేష్‌తో పాటు పలువురు సమస్యలను వివరించారు. ఉత్తరాంధ్రలో 80 శాతం తెలగ కులస్థులు ఉన్నారని... బీసీ రిజర్వేషన్ లేని కారణంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వివరించారు. దీనిపై ఉపతహసీల్దారు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో ఆదా

సాలూరు రూరల్: రబీ సాగులో డ్రమ్ సీడింగ్ ద్వారా రైతులకు ఎకరానికి రూ.10 వేలు ఆదా అవుతుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏఈవో ఎం.నాగేశ్వరరావు అన్నారు. గంగన్నదొరవలసలో రైతు నారాయణ పొలంలో ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం రబీ సాగుకు డ్రమ్ సీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. కూలీల కొరత ఉన్న నేపథ్యంలో డ్రమ్ సీడింగ్ ఉత్తమమైనదన్నారు.

పోలమాంబ హుండీల లెక్కింపు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి హుండీల లెక్కింపు శుక్రవారం చేపట్టారు. వనంగుడిలోని 6 హుండీలను లెక్కించగా 85 రోజులకు గాను రూ.84,359 వచ్చినట్లు ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. దేవదాయశాఖ తనిఖీదారు ఎన్.రాజకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పూడి దాలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, విశ్రాంత ఈవో జి.శ్రీరామ్మూర్తి, బ్యాంకు సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద అపరిశుభ్రత


బత్తిలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పేరుకుపోయిన చెత్త

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కానీ భామిని మండలం బత్తిలిలో అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి ప్రారంభించకపోగా.. విగ్రహం వద్ద అపరిశుభ్రంగా ఉండడం గమనార్హం.

ఫ్రైడే.. డ్రైడేగా పాటించాలి

పార్వతీపురంటౌన్: ప్రతిఒక్కరూ దోమల నివారణకు ప్రతి శుక్రవారం 'ఫ్రైడే... డ్రైడే' కార్యక్రమాన్ని పాటించాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 14వ వార్డులో ఇళ్ల పరిసరాల్లోని కుండీలు, వాడుకలో లేని వస్తువుల్లో ఉన్న నీటి నిల్వలను పరిశీలించారు. అందులో దోమల ఉత్పత్తి ఏవిధంగా జరుగుతుందో ప్రజలకు చూపించారు. డ్రైడే పై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.

శంబర ప్రసాదాల పరిశీలన

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి జాతరలో భాగంగా భక్తులకు విక్రయించేందుకు తయారు చేసే ప్రసాదాలను శుక్రవారం జిల్లా ఆహార తనిఖీ అధికారి రామయ్య పరిశీలించారు. ప్రసాదాల తయారీ విధానాన్ని, ఉపయోగించే పదార్థాల నాణ్యతను పరిశీలించి సూచనలు చేశారు. ప్రసాదాల తయారీలో నాణ్యత పాటించాలని, ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. భక్తుల రద్దీ దృష్ట్యా తయారీని వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు స్పందన కరువు


ఖాళీగా ఉన్న కుర్చీలు

సీతానగరం: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ అందించే రిసోర్స్‌పర్సన్ లేక పోవడంతో సర్పంచ్‌లు వెనుదిరిగారు. పంచాయితీ కార్యదర్శులు కులగణన సర్వే పనుల్లో నిమగ్నమవ్వడంతో శిక్షణ అందించలేకపోయామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు.

28న అబ్బూరి శతజయంతి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: కేంద్ర సాహిత్య అకాడమీ దక్షిణ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 28న అబ్బూరి వరద రాజేశ్వరరావు శతజయంతి రాజాంలో జరుగుతుందని రాజాం రచయితల వేదిక నిర్వాహకులు గార రంగనాథం తెలిపారు. పార్వతీపురం పట్టణంలో ప్రముఖ రచయిత, కవి, గంటేడ గౌరునాయుడు నివాసంలో కవులు, రచయితలు, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షులు అదపాక సత్యారావుతో శు క్రవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆహ్వానాలు అందించారు.

రిపబ్లిక్ దినోత్సవానికి ఆహ్వానం

సీతంపేట: ఢిల్లీలో ఈ నెల 26న నిర్వహించే రిపబ్లిక్ దినోత్సవానికి గిరిజన విద్యార్థులకు ఆహ్వానం వచ్చినట్టు జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర శుక్రవారం తెలిపారు. మల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన నిమ్మక అమ్ము, చీపి బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన సవర శ్రీను, సీతంపేట బాలికల గురుకుల రెసిడెన్షియల్ ఆశ్రమ పాఠశాలకు చెందిన ఎం.మహేశ్వరి ఈ ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

గరుగుబిల్లి: విద్యార్థులకు మెరుగైన బోధన అందించడంతో పాటు ఉన్నతులుగా మార్చిన ఉపాధ్యాయులకు తగిన గుర్తింపు లభిస్తుందని డాక్టర్ వెంగళ శివన్నాయుడు అన్నారు. శుక్రవారం రావివలసలో జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు కె.తిరుమలరావును ఘనంగా సత్కరించారు. డాక్టర్ శివన్నాయుడు రచించిన వెలుగు జాడలు గ్రంథాన్ని తిరుమలరావుకు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

సర్వే సక్రమంగా నిర్వహించాలి

గరుగుబిల్లి: గ్రామాల్లో కుల గణన సర్వే సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావులు సూచించారు. శుక్రవారం 13 సచివాలయాల పరిధిలో కుల గణన ప్రారంభమైంది. ఈ మేరకు గరుగుబిల్లి, ఉల్లిభద్ర, పెద్దూరు తదితర గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ పరిశీలనలో కార్యదర్శులు డి.జగదీశ్వర రావు, కోటేశ్వరరావు, శంకరరావు, కె.సురేష్‌తో పాటు పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించాలి

సాలూరు రూరల్: ఉమ్మడి జిల్లాలో 34 మండల పరిషత్‌లకు వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధులను సత్వరం వెచ్చించాలని విజయనగరం జిల్లా సీఈవో రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం సాలూరు మండల పరిషత్‌ను తనిఖీ చేశారు. మండల పరిషత్‌కు వచ్చిన నిధులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండల పరిషత్‌లకు 2022- 2023 ఆర్థిక సంవత్సరంలో రెండు విడతలకు రూ. 16 కోట్లు వచ్చాయన్నారు. వాటిని నిబంధనల ప్రకారం సత్వరమే ఖర్చు చేయాలన్నారు. ఆయనతో సాలూరు ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి ఉన్నారు.